క్లుప్తంగా

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

ఊట్కూరు: విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు రవికుమార్ అన్నారు. బుధవారం ఎడివెల్లి గ్రామంలో 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటప్ప, సాయప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు వెంటనే పరిష్కరించండి



మాగనూర్: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగలక్ష్మిను బుధవారం మండల బీజేపీ ఉపాధ్యాక్షుడు రాంగోపాల్ శెట్టి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రైతుల భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, సీనియర్ నాయకులు వాకిటి బాలప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేరాలను అరికట్టేందుకే కార్డెన్ సెర్చ్



దామరగిద్ద: నేరాలను నియంత్రించడానికే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ శివశంకర్, ఎస్ఐ రాజులు అన్నారు. బుధవారం మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో ఎస్ఐ రాజు సమక్షంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది పోలీసులు అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. వివిధ కారణాలతో 24 వాహనాలను సీజ్ చేశారు. మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, రోడ్డు భద్రత నియమాలు పాటించకపోయినా, తాగి వాహనాలు నడిపినా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాముడు, మహేశ్వరి, ఆర్ఎస్ఐ శివశంకర్, మద్దయ్య కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి



ఆత్మకూర్: ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. బుధవారం ఏడవ వార్డులో అధికారులు, సిబ్బందితో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి 100 రోజుల కార్యాచరణను రూపొందించి ముందుకెళుతున్నట్లు తెలిపారు. అనంతరం పారిశుధ్యం, వన మహోత్సవం, ఇంకుడు గుంతల నిర్మాణాలు తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన ఆత్మకూర్ క్రీడాకారులు

ఆత్మకూర్: వేసవి శిక్షణ శిబిరాల్లో వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన ఆత్మకూర్ విద్యార్థులు నారాయణపేట జిల్లా గుడుమాల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి మొదటి, ద్వితీయ బహుమతులు సాధించారు. బుధవారం జరిగిన ఫైనల్ పోటీల్లో అండర్–12, అండర్–14 విభాగాల్లో బహుమతులు సాధించి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కోచ్ ఖాదర్, సీనియర్ క్రీడాకారులు బాలు, అఫ్రోజ్, దివాకర్, తాండూర్ కిషోర్ అభినందించారు.

సెల్‌ఫోన్లు అందజేత

ఆత్మకూర్: ఇటీవల చోరీకి గురైన సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్ మండలం పిన్నంచర్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మోట్లంపల్లి గ్రామానికి చెందిన రాఘవేంద్రల ఫోన్లు ఇటీవల చోరీకి గురి కాగా బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బుధవారం రాత్రి బాధితులకు అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు. సెల్‌ఫోన్లు చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు



వాడ్వట్–అడవిసత్యారం లోలెవల్ బ్రిడ్జిపై పారుతున్న వరద (ఫైల్)

- చిన్నపాటి వర్షానికే వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద
- పలు గ్రామాలకు నిలిచిపోతున్న రాకపోకలు
- హైలెవల్ వంతెనగా మార్చాలని ప్రజల వినతులు



వర్క్యూర్ చిన్నవాగుపై వరద ఉధృతి (ఫైల్)

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల మధ్య నిర్మించిన లోలెవల్ వంతెనలతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు కురిసినప్పుడు రాకపోకలకు ఆటంకం లేకుండా హైలెవల్ వంతెన నిర్మించాల్సిన అధికారులు గతంలో లోలెవల్ వంతెనలు నిర్మించి చేతులు దులుపుకున్నారు. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద వంతెనల పైనుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలంలోని అడవిసత్యారం–మందిపల్లి, వర్క్యూర్–మాగనూర్, నేరడగం–మక్తల్ గ్రామాల మధ్య రోడ్లపై లోలెవల్ వంతెనలు నిర్మించారు. కానీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎత్తు పల్లాలను పట్టించుకోకుండా వంతెన నిర్మాణం చేపట్టడంతో చిన్న పాటి వర్షానికే బ్రిడ్జిల పై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో వరదలు వచ్చినప్పుడల్లా ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. ఇదిలా ఉండగా రోడ్డు వెడల్పు చిన్నగా ఉండటంతో వాహనాలు తిరిగి వెళ్లడానికి వీలు కాకపోవడంతో వరద ఉధృతి తగ్గే వరకు ఎక్కడివారు అక్కడే ఉండాల్సిన దుస్థితి నెలకొంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద తగ్గే వరకు ఇంటికే పరిమితం

వాడ్వట్–అడవిసత్యారం గ్రామాల మధ్య సంగం బండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీరుతో పాటు చిన్న పాటి వర్షానికే వరద నీరు బ్రిడ్జిపై నుంచి వెళ్తుంది. దీంతో వాడ్వట్, అడవి సత్యారం గ్రామాల మధ్య విద్యార్థులు, కార్మికులు, ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. వరద తగ్గే వరకు ఇంటికే పరిమితం కావాల్సి వస్తుంది. ఆయా గ్రామాల నుంచి ఉపాధి పనులకు వెళ్లే కూలీలు సైతం పనులకు వెళ్లలేకపోతున్నారు. ఈ సారి వానాకాలం ప్రారంభం కాక ముందే వర్షాలు దంచికొడుతుండడంతో ఆయా వాగులకు వరదలు వస్తే గతేడాది మాదిరిగానే నరకయాతన పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లోలెవల్, ఇరుకు వంతెనలను తొలగించి వాటి స్థానంలో ఎగువ వంతెన (హై లెవల్ వంతెన) నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి..



లోలెవల్ వంతెనలతో వరదలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వంతెనలు పునఃనిర్మించాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి నూతన వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

– బసంత్‌రెడ్డి, వడ్వాట్ గ్రామస్తుడు

అత్యవసర సమయంలో ఇబ్బందులు..



మండల పరిధిలోని వర్క్యూర్ గ్రామానికి రావాలంటే వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గ్రామానికి ఇరువైపులా లోలెవల్ వంతెనలు వర్క్యూర్ చిన్న వాగు, నేరడగం పెద్దవాగుపై వంతెనలు నిర్మించారు. వర్షాకాలం వస్తే చాలు వరద తగ్గే వరకు గ్రామం మొత్తం జలదిగ్బంధంలోకి వెళ్లిపోతుంది. అధికారులు గ్రామస్తుల బాధలను పట్టించుకొని హైలెవల్ వంతెనల నిర్మాణం చేపట్టాలి.

– శివ, వర్క్యూర్ గ్రామస్తుడు

త్వరలోనే హైలెవల్ వంతెనలు నిర్మిస్తాం..



లోలెవల్ వంతెనలతో చాలా గ్రామాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. హై లెవల్ వంతెల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. నిధులు మంజూరు అయినా వెంటనే పనులు ప్రారంభించి ఇబ్బందులు తొలగిస్తాం.

–మారుతీ, మాగనూరు, పంచాయతీ రాజ్ ఇన్‌చార్జి ఏఈ

దుకాణాలను వెంటనే తొలగించాలి



మార్కెట్ యార్డులో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మక్తల్: పట్టణంలోని మార్కెట్ యార్డుల్లో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ దుకాణాల యజమానులకు సూచించారు. మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ రాధమ్మ సూచన మేరకు బుధవారం మక్తల్ మార్కెట్ యార్డు స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న షాపులను ఆయన పరిశీలించారు. నాలుగు రోజుల్లో షాపులను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్ కుమార్, డైరెక్టర్లు రంజిత్ రెడ్డి, ఎండీ సలాం, ఫయాజ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ



వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కోస్గి రూరల్: మండలంలోని అమ్లీకుంట–గుండుమాల్ గ్రామాల మధ్య రాకపోకల కోసం వంతెన నిర్మాణానికి మండల పార్టీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మాజీ ఎంపీపీ మధుకర్‌రావులు బుధవారం భూమి పూజ చేశారు. రెండు గ్రామాల మధ్య వంతెన లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో సమస్యను గుర్తించిన అధికారులు ప్రజా ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ అంజిరెడ్డి, ఈశ్వరయ్య, నరసింహ రెడ్డి, వెంకటయ్య, నరసయ్య పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి



బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేసిన నాయకులు

కోస్గిరూరల్: యాదవులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న విధానానికి స్వస్తి చెప్పి యాదవులు రాజకీయంగా ఎదగాలని నారాయణపేట్ జిల్లా అధ్యక్షుడు హన్మంతు యాదవ్ అన్నారు. బుధవారం గుండుమాల్ మండల పరిధిలోని భక్తిమళ్ల గ్రామంలో ఆలిండియా యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 60 వేల మంది యాదవ వర్గానికి చెందిన వారు ఉన్నారని, నాయకులు యాదవులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని తెలిపారు. అనంతరం యాదవుల సంక్షేమమే ధ్యేయంగా ఈ నెల చివరలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అధిక సంఖ్యలో యాదవులు సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కర్ణం వెంకట్రాములు, మల్లేష్, కృష్ణయ్య, మల్లయ్య ఉన్నారు.

రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు



ఫర్టిలైజర్ షాపులో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ నవీద్

మాగనూర్: నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని కృష్ణ ఎస్ఐ నవీద్, ఏఓ సుదర్శన్‌గౌడ్ హెచ్చరించారు. బుధవా రం వారు మండలంలోని పలు గ్రామాలలోని సీడ్స్, ఫర్టిలైజర్ షాపులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల లైసెన్సు లు, స్టాక్ రిజిస్టర్‌లు తనిఖీ చేశారు. ఎవరైనా కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసే దళారుల గురించి తెలిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ముళ్ల పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు పెరగడంతో ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ మొత్తం గుంతలో ఉండటంతో మూగజీవాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

యువ వికాసం పేరిట యువతకు టోకరా

అమరచింత: రాజీవ్ యువవికాసం పథకం పేరిట నిరుద్యోగ యువకులను ప్రభుత్వం మోసగిస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మండిపడ్డారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో స్థానిక యువకులతో కలిసి రాజీవ్ యువవికాసం దరకాస్తుదారులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. రూ.లక్ష రుణాలు ఇవ్వడానికి ఎక్కడా లేని నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. రూ.3 నుంచి 4 లక్షల వరకు రుణాలు ఇస్తామన్న సర్కారు నేడు మాట మార్చి రూ.50 వేలు, రూ.లక్ష వరకే రుణాలు అందిస్తున్నామడం హస్యాస్పదంగా ఉందన్నారు. బ్యాంక్‌లో ఖాతాలు కలిగి లావాదేవీలు చేస్తూ సిబిల్ స్కోర్ ఉన్న వారికే రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకర్లు చెప్పడం సరికాదన్నారు. దరకాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ తక్షణమే రుణాలు ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనురాగ్, చేతన్, ఆదర్శ్, తేజ, విశాల్ పాల్గొన్నారు.

గోరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



పోలీసులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఊట్కూరు: గోరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఊట్కూరు పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు వెంగలి రాముడు మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను తక్షణమే మూసివేయాలని కోరారు. గుర్తింపు పొందిన గోశాలలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని ప్రతి జిల్లాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భరత్, వెంకట్‌నారాయణ, జగన్నాథ్‌రావు, ప్రవీన్ పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నచింతకుంట: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు జి.సురేశ్‌కుమార్, దుర్గాప్రసాద్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అబియాన్‌లో భాగంగా బుధవారం చిన్నచింతకుంట రైతువేదికలో మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు అత్యాధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పంటల సాగులో ఆధునిక యంత్రాల వినియోగంతో పనిభారం, పెట్టుబడి తగ్గుతుందని అన్నారు. అదే విధంగా పంటసాగుకు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ మేరకు నూనెగింజలు, చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి, ఏఓ రాజేష్ ఖన్నా, ఏఈఓలు తిరుపతయ్య, శాంసన్, అనిల్‌కుమార్ రెడ్డి, చంద్రకళ పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యం




మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ఆత్మకూర్: రైతులు పంటల సాగులో అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు పాలెం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాంరెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ, హార్టికల్చర్, వెటర్నరీ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ఆరేపల్లి రైతు వేదికలో అధిక సాగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, పచ్చిరొట్టె ఎరువులను వాడాలని, వరికొయ్యలను తుగుల బెట్టకుండా నేలలోనే ఉంచి నేల సారాన్ని పెంచాలని సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వినయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, ఏఈఓలు సంతోష్, ఝాన్సీ, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు

అమరచింత: మండలంలోని మిట్టనందిమళ్ల గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహాపూజ కార్యక్రమాలు వైభవంగా జరిపించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి పాటిమీది ఆంజనేయస్వామి ఆలయంలో వేదపండితుల సమక్షంలో హోమ కార్యక్రమాలు కొనసాగాయి. అలాగే దేవతామూర్తుల విగ్రహలను జలాదివాసం, దాన్యదివాసం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మించిన పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నా యి. బుధవారం ఉదయం నుంచి ప్రాతఃపూజలు, గణపతి, నవగ్రహ, వాస్తుహోమం, ఆదివాసంగ హోమం, చండీహోమం, మహాస్నపనం, చదుష్పదబలి, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పూజల అనంతరం జలాధివాసం నిర్వహించారు. గురువారం స్వస్తిశ్రీ విశ్వాసు నామసంవత్సరం జ్యేష్ఠశుద్ధ దశమి ఉదయం 5 గంటల నుంచి ప్రాతఃపూజలు, గర్తన్యాసములు, ప్రతిష్ఠాంగహోమం, ఉదయం 7.56 గంటలకు మంత్రప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠకళ్యాల, మహాపూర్ణాహుతి పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

డ్రాఫ్ట్ ప్రతిపాదనలపై అభ్యంతరాల స్వీకరణ


మద్దూరు: ప్రభు త్వ ఉత్తర్వుల మేరకు మద్దూరు పురపాలక సంఘం పరిధిలోని జనాభా, ఓటర్ల ప్రాతిపదికన 16 వార్డు లుగా డ్రాఫ్ట్ ప్రతి పాదనలను తయారు చేసి తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్, పురపాలక కార్యాలయం వార్డుల వారీగా నోటీసు బోర్డులో ఉంచినట్లు కమిషనర్ శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిపాదనలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈనెల 11వ తేదీలోపు రాత పూర్వకంగా రాసి పురపాలక సంఘ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



మద్దూరు: మండల పరిధిలోని ఖాజీపూర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్లకు గృహ నిర్మాణ శాఖ ఏఈ శాంతికుమార్, ఎంపీడీఓ, ఎంపీఓ గ్రామ మాజీ సర్పంచ్‌తో కలిసి మార్కింగ్ వేశారు. ఖాజీపూర్ గ్రామ పంచాయతీకి 10 ఇళ్లు మంజూరు కాగా బుధవారం నాలుగు ఇళ్లకు మార్కింగ్ వేసి భూమి పూజలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో మండలంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



పాతపల్లిలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు



తీలేరులో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

ఊట్కూర్: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చింతరవి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నపొర్ల, ఎర్గాట్‌పల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వారసత్వం, అసైన్మెంట్, సాదా బైనామా, రిజిస్టర్ కొనుగోలు, దానం తదితర భూ సమస్యల పరిష్కారం కోసం సదస్సులో అర్జీలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాఘవేదంర్ రెడ్డి, ఆర్ఐ వెంకటేశ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. బుధ వారం అల్లీపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన సదస్సులో 5, మన్నాపూర్‌లో 20 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జయరాములు తెలిపారు. భూసమస్యలు ఉన్న రైతులు గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులో దరఖాస్తు చేసుకుంటే భూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ శ్రావణ్ కుమార్, నర్సింములు, కార్యాలయ సిబ్బంది మహేశ్ పాల్గొన్నారు.

6 దరఖాస్తుల స్వీకరణ

ధన్వాద: రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ అన్నారు. ఈమేరకు బుధవారం మండంలోని పాతపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 6 దరఖాస్తులు రాగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆగస్టులోపు పరిష్కారం

మరికల్: మండలంలోని తీలేరు, జిన్నారం గ్రామాలలో బుధవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతిపై రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామ్‌కోటి మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు సదస్సులో పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూ సమస్యలను ఆగస్టులోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ బీబీ హజ్రా, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.